ఓం నమశ్శివాయ

ఆలయాల్లో మార్మోగిన శివనామస్మరణ

- శివాలయాల్లో భక్తుల కిటకిట
- వైభవంగా మహాశివరాత్రి వేడుకలు
- కురవి వీరభద్రుడికి ప్రముఖుల పూజలు

పెద్దవంగర: రామలింగేశ్వర స్వామి ఆలయంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కురవి: స్వామివారిని దర్శించుకుంటున్న మండలిలో బీఆర్ఎస్ పార్టీ విప్ సత్యవతిరాథోడ్

కురవి, ఫిబ్రవరి 26: మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం కురవి వీరభద్రస్వామి ఆలయంలో సామూహిక మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. పాలకమండలి, దేవాదాయ అధికారుల నడుమ సమన్వయం లోపించడంతో వీఐపీ క్యూలైన్ కిక్కిరిసి సాధారణ భక్తులు, సంపూర్ణ అభిషేకం చేసే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం భద్రకాళీ, వీరభద్రస్వామి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. ఉత్సవ విగ్రహాలను వేర్వేరు శావల్లో ఊరేగింపునకు భక్తులు తీసుకెళ్లారు. గండిమైసమ్మ వద్ద ఎదుర్కోలు తర్వాత నాగమయ్య ఆలయ స్థలంలో కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. శాసన మండలిలో బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ స్వామివారిని దర్శించుకున్నారు. ఆమె మాట్లాడుతూ వీరభద్రస్వామి జాతర నిర్వహణ ఈసారి సరిగా లేదన్నారు. తీవ్ర ఆలస్యం వల్ల భక్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వీరభద్రుడిని దర్శించుకున్న ప్రముఖులు

భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రూనాయక్ దంపతులు, ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ దంపతులు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, మాజీ జడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ యూత్ నియోజకవర్గ నాయకుడు డీఎస్ రవి చంద్ర, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట లాలయ్య, బీఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకులు గుగులోత్ రవి, నూతక్కి నర్సింహారావు, గుడిబోయిన రాంచంద్రయ్య, బండి దీపక్, సూర్య, వినోద్, మాజీ కురవి ఉపసర్పంచ్ సంగెం భరత్, ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు.

చిన్నగూడూరు: మండలం ఉగ్గంపల్లిలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు చేశారు.

కురవి: ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు దంపతులు


చిన్నగూడూరు: ఉగ్గంపల్లిలో మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

ఏర్పాట్లు.. వరస్ట్

- జాతర నిర్వహణపై ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు ఆగ్రహం
- కురవి వీరభద్ర ఆలయ ఈవో, పాలకమండలి తీరుపై మండిపాటు

కురవి, ఫిబ్రవరి 26 : మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్ర ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం జాతర ఏర్పాట్లు అధ్వానంగా ఉన్నాయని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామి వారిని దర్శించుకునేందుకు ఆయన సతీ సమేతంగా హాజరయ్యారు. వీఐపీ క్యూ లైన్ నుంచి లోపలికి వచ్చే సమయంలో ఎంతకీ కదలకపోవడంతో అసహనానికి గురయ్యారు. వీఐపీ దర్శనం పట్టించుకోకపోతే ఎలా? అంటూ అక్కడే ఉన్న ఆలయ ఈవో సత్యనారాయణపై మండిపడ్డారు. అప్రమత్తమైన అధికారులు ఎమ్మెల్సీ దంపతులను మరో గేటు గుండా స్వామి వారి దర్శనం చేయించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాతర నిర్వహణను గాలికొదిలేశారన్నారు. ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటికైనా అప్రమత్తం కాకుంటే, రాత్రి జరిగే కల్యాణోత్సవం మరింత ఇబ్బంది పడే పరిస్థితి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. తాను ఎన్నో ఏళ్లుగా జాతరకు వస్తున్నానని, భక్తులు ఇంత అసౌకర్యానికి గురవడం, వీఐపీల దర్శనాలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడాన్ని ఇప్పుడే చూశానన్నారు. ఆలయ అధికారులు, పాలకమండలి, పోలీసుల తీరు వల్లే ఇలా అధ్వానంగా తయారైందన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం, సంబంధిత శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు.

5న వాహనాలు బహిరంగ వేలం

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 26 : సారాయి, బెల్లం సరఫరా చేస్తూ వివిధ కేసుల్లో పట్టుబడి వాహనాలకు వచ్చే నెల 5న బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చిరంజీవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వాహనాల వివరాలు మానుకోటలోని ఎక్సైజ్ స్టేషన్‌లో ఉంటాయని, వేలం పాటలో పాల్గొనేవారు వాహనాలు చూసుకోవాలని సూచించారు. ఈనెల 27 నుంచి మార్చి 4 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వేలం పాటలో వాహనం పొందిన వారు అదేరోజు మొత్తం డబ్బులు చెల్లించాలని తెలిపారు.

అర్ధరాత్రి ముగ్గురు యువకుల హల్‌చల్

తొర్రూరు, ఫిబ్రవరి 26: పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి ముగ్గురు యువకులు రోడ్లపై తిరుగుతూ హల్‌చల్ చేస్తుండగా పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. యువకులను హెచ్చరించి, తల్లిదండ్రుల ఒప్పందంపై విడిచిపెట్టారు. ఎస్సై ఉపేందర్ మాట్లాడుతూ అర్ధరాత్రి అనవసరంగా రోడ్లపై తిరిగే యువత సమస్యలకు కారణమవుతారని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తల్లిదండ్రులు పిల్లలపై దృష్టిసారించాలని సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326545

WANTED

jobs Apply Now!

★ లేడీ టెలికాలర్స్, బ్యాగ్‌గ్రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

కేసీఆర్ పాలనలోనే ఆలయాల అభివృద్ధి

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర/తొర్రూరు, ఫిబ్రవరి 26: తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పాలనలోనే ఆలయాలు అభివృద్ధి చెందాయని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం పెద్దవంగర మండలం చిన్నవంగర శివారులోని రామలింగేశ్వర ఆలయం, తొర్రూరు మండలం నాంచారిమడూరులోని శివాలయంలో పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ కేసీఆర్ రాష్ట్రంలోని అనేక ఆలయాలను అభివృద్ధి చేశారని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వేయిస్తంభాల ఆలయం, రామప్ప, పాలకుర్తి, ఇతర ఆలయాలను అభివృద్ధి చేశారని వివరించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్య, సంజయ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సునీల్‌కుమార్‌రెడ్డి, సుధీర్‌కుమార్, విజయ్‌పాల్‌రెడ్డి, సోమిరెడ్డి, అజయ్‌రెడ్డి, రాము, భిక్షపతి, అనుదీప్, యాకయ్య, బాలు నాయక్ పాల్గొన్నారు.

వేట కొడవలితో వదినపై మరిది దాడి

గాయపడ్డ నూనావత్ రాజీ

కేసముద్రం, ఫిబ్రవరి 26: మండలంలోని తావుర్యతండా జీపీ శివారు మూలస్తంభం వద్ద వేట కొడవలితో వదినపై బుధవారం మరిది దాడి చేశాడు. ఎస్సై మురళీధర్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. నూనావత్ రాజీ-రవీందర్ దంపతులు మూలస్తంభం వద్ద ఉన్న తమ స్థలంలో ఇల్లు నిర్మిస్తున్నారు. ఈ స్థలం విషయంలో రవీందర్‌కు అతడి తమ్ముడు రమేశ్‌తో కొన్నిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇంటి నిర్మాణ పనులు చేస్తున్న వదిన నూనావత్ రాజీపై వేటకొడవలితో మరిది రమేశ్ దాడి చేశాడు. గాయపడిన రాజీని చికిత్స కోసం 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగులమందు తాగి ఆత్మహత్య

గూడూరు, ఫిబ్రవరి 26: అప్పుల బాధ భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొల్లాపురంలో బుధవారం జరిగింది. ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పిట్టల వీరన్న (40) బతుకుదెరువు కోసం టాటా ఏస్ ట్రాలీ కొన్ని నెలల క్రితం కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో కిరాయి దొరక్క పోవడంతో ఫైనాన్స్ కిస్తీలు చెల్లించలేదు. దీనికితోడు తన కుటుంబానికి రూ.5.5లక్షల వరకు అప్పులయ్యాయి. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన అతడు బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగాడు. కొద్దిరోపటి తర్వాత ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు గమనించి మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య జయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

కేసముద్రంలో శిశువు కొనుగోలు కలకలం

కేసముద్రం, ఫిబ్రవరి 26 : మండలానికి చెందిన ఓ వ్యక్తి మగ శిశువును కొనుగోలు చేసిన ఘటన కలకలం లేపింది. తెలంగాణ, గుజరాత్ రాష్ట్రాల్లో కొందరు ముఠాగా ఏర్పడి సంతానం లేనివారికి పిల్లలను విక్రయించే వ్యాపారం చేస్తున్నట్లు తెలిసింది. మగ శిశువు ఒక రేటు, ఆడ శిశువు ఒక రేటుకు అమ్ముతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కేసముద్రంకు చెందిన ఓ వ్యక్తి మగ శిశువు కావాలని ఆ ముఠాను ఆశ్రయించగా, అతడి వద్ద డబ్బులు తీసుకుని 10 రోజుల క్రితం మగ శిశువును ఇచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో చిన్నపిల్లలను విక్రయించే ముఠా పోలీసులకు పట్టుపడినట్లు తెలిసింది. పోలీసుల విచారణలో మగశిశువును కేసముద్రం వాసికి విక్రయించినట్లు తేలింది. పోలీసులు మూడు రోజుల క్రితం ఆ వ్యక్తి నుంచి శిశువును తీసుకెళ్లినట్లు సమాచారం.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పవన్(ఫైల్)

కురవి(సీరోలు), ఫిబ్రవరి 26: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతిచెందిన ఘటన బుధవారం సీరోలు మండలం కాంపల్లి శివారు బీల్యా నాయక్ తండా పరిధి తునికిచెట్టు తండాలో జరిగింది. సీరోలు ఎస్సై నగేష్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బానోత్ శ్రీను కుమారుడు పవన్(19) వ్యవసాయబావి వద్ద విద్యుత్ వైర్లను సరిచేస్తుండగా షాక్ కొట్టి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయం కుటుంబసభ్యులకు తెలిసి హుటాహుటిన బావివద్దకు వెళ్లారు. పవన్ విద్యుత్ మోటార్ వద్ద మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ విషయమై ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు.

జారిపడ్డ వృద్ధురాలి తరలింపు

వృద్ధురాలిని స్టెచర్‌పై తరలిస్తున్న సిబ్బంది

కురవి, ఫిబ్రవరి 26: మహాశివరాత్రి సందర్భంగా వీరభద్ర స్వామికి దర్శించుకునేందుకు ఖమ్మంలోని శ్రీనివాస్‌నగర్‌కు చెందిన వృద్ధురాలు వెంపటి దుర్గమ్మ స్నాన ఘట్టాల వద్ద జారి పడింది. అక్కడే బందోబస్తులో ఉన్న బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ రమేశ్, ఎస్‌బీ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ అనిల్‌కుమార్ ప్రాథమిక చికిత్స తర్వాత స్టెచర్‌లో అంబులెన్స్‌లో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గొర్రెను రక్షించబోయి..

- విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి మృతి

కురవి, ఫిబ్రవరి 26: విద్యుత్ షాక్‌తో విలవిలలాడుతున్న గొర్రెను రక్షించబోయి కాపరి మృత్యువాత పడిన ఘటన మండలంలోని రాజోలులో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన గొర్రెల కాపరి పాశం మల్లయ్య(55) రోజూలాగే గొర్రెలు, మేకలను మేతకు తీసుకెళ్లాడు. సాయంత్రం అదే గ్రామంలోని కలకోట రాముకు చెందిన సూపర్ మార్కెట్ వెనుక ఎర్త్ వైరుకు గొర్రె తగిలి షాక్‌తో విలవిలలాడుతోంది. రక్షించేందుకు దాన్ని పట్టుకుని లాగే యత్నం చేశాడు. ఈ క్రమంలో అతడికి షాక్ కొట్టి అక్కడికక్కడే మృతిచెందాడు. రాము షాపుకు చెందిన ఎర్త్‌వైరు అజాగ్రత్తగా ఏర్పాటు చేయడం వల్లే మల్లయ్య మృతి చెందాడని కుటుంబసభ్యులు మృతదేహంతో షాపు ఎదుట ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడికి భార్య వినోద, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

జామాయిల్ తోట దగ్ధం

మంటలు ఆర్పేస్తున్న ఫైర్ సిబ్బంది

డోర్నకల్, ఫిబ్రవరి 26: గొల్లచర్ల నుంచి చిల్కోడు వెళ్లే రోడ్డులో రైతు సాయిబాబు వ్యవసాయ క్షేత్రంలోని జామాయిల్ తోటకు బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో రైతు మహబూబాబాద్ ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది ఫైరింజిన్‌తో వచ్చి మంటలు ఆర్పేశారు. సుమారు 20గుంటల వరకు జామాయిల్ తోట అగ్నికి ఆహుతైందని, రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని రైతు తెలిపారు. ఏఎస్సై రవీందర్, కానిస్టేబుల్ రమేశ్, డ్రైవర్ షఫీ, హోమ్‌గార్డులు రాజు, వెంకటేశ్ పాల్గొన్నారు.

పోలింగ్ సామగ్రి తరలింపు

సామగ్రిని తరలిస్తున్న అధికారులు

తొర్రూరు, ఫిబ్రవరి 26: టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిసైడింగ్ ఎన్నికల అధికారి ఆకుల రవి (డీటీ ఆర్డీఓ ఆఫీస్ మహబూబాబాద్) తెలిపారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ బూత్ నంబర్ 47లో మొత్తం ఓటర్లు 315 కాగా, అందులో 221 మంది పురుషులు, 94 మంది మహిళా ఓటర్లు ఉన్నారని అధికారులు వెల్లడించారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై ఉపేందర్, ఆర్ఐ బషీర్‌పాషా పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

కురవి, ఫిబ్రవరి 26: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో డోర్నకల్ నియోజకవర్గ యువజన నాయకుడు డీఎస్ రవిచంద్ర బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత ఆదేశాల మేరకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు హరితమ్మ ఫాలోవర్స్ ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ ప్యాకెట్ల అందజేత కార్యక్రమాన్ని రవిచంద్ర ప్రారంభించారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తోట లాలయ్య, సంగెం భరత్, వినోద్, గుగులోత్ రవి, కిషోర్ పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు డీఎస్ రవిచంద్ర

మెగా క్రికెట్ టోర్నీ విజేత వేలుబెల్లి

గంగారం, ఫిబ్రవరి 26: మండల కేంద్రంలోని చైతన్య యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్ విజేతగా వేలుబెల్లి జట్టు నిలిచింది. ఆరు మండలాల్లోని వివిధ గ్రామాల క్రీడాకారులు ఉత్సాహంగా ఈ టోర్నీలో క్రీడా ప్రతిభ కనబరిచారు. బుధవారం ఫైనల్‌లో బయ్యారం మండలం సింగారం, కొత్తగూడ మండలం వేలుబెల్లి జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. విన్నర్‌గా వేలుబెల్లి జట్టు, రన్నర్‌గా సింగారం జట్లు నిలిచాయి. వారికి చైతన్య యూత్ కమిటీ, గ్రామ పెద్దల సమక్షంలో ప్రథమ బహుమతిగా రూ.15వేలు, షీల్డు, ద్వితీయ బహుమతిగా రూ.12వేలు, షీల్డు అందించారు. చైతన్య యూత్ కమిటీ సభ్యులు రంజిత్, కృష్ణ, మహేశ్, సారయ్య, గ్రామ పెద్దలు జెజ్జరి సమ్మయ్య, ఈసం వెంకటయ్య పాల్గొన్నారు.

విజేత జట్టుకు షీల్డు బహూకరిస్తున్న చైతన్య యూత్ కమిటీ, గ్రామ పెద్దలు

జాతీయ సదస్సును జయప్రదం చేయాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 26 : ఈనెల 28న హైదరాబాద్‌లో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జాతీయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ సదస్సును జయప్రదం చేయాలని మాస్‌లైన్ డివిజన్ కమిటీ సహాయ కార్యదర్శి బిల్లాకంటి సూర్యం పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో జాతీయ సదస్సుపై విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కుల మతాల మధ్య విభేదాలను సృష్టిస్తోందన్నారు. ధనిక, పేదల నడుమ అవాంతరాలు పెరిగే విధానాలు వెంటనే మానుకోవాలని, బీజేపీ అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పైండ్ల యాకయ్య, వెంకన్న పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని పెంచుతున్న మోదీ ప్రభుత్వం

తొర్రూరు: దేశంలో మోదీ ప్రభుత్వం మతోన్మాదాన్ని పెంచుతోందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి విమర్శించారు. ఈనెల 28న న్యూఢిల్లీలో జరగనున్న అఖిల భారత సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ తొర్రూరులో ప్రచార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసేందుకు స్వయం ప్రతిపత్తి గల సంస్థలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. దేశ సహజ వనరులను అంబానీ, అదాని వంటి కార్పొరేట్ సంస్థలకు అప్పగించారని విమర్శించారు. పార్టీ నాయకులు అర్వపల్లి వెంకన్న, మాచర్ల మురళి, బానోత్ నందీశ్వర్, బానోత్ రవీందర్, రాములు, సుగుణమ్మ, అనిత, రాములమ్మ, ఉపేంద్ర పాల్గొన్నారు.

తొర్రూరు: మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు

ఎమ్మెల్సీ పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 26 : నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఫాతిమా హైస్కూల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల సామగ్రి పంపిణీ పక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 16 పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఓటర్లకు సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి, ఆర్డీవో కృష్ణవేణి పాల్గొన్నారు.

పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించాలి

జిల్లాలో ఎమ్మెల్యే ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది కృషిచేయాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ విధులకు జిల్లాలో 150 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వర్తించే అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మంటల్లో కాలి బూడిదైన రూ.1.5లక్షల నగదు, విలువైన పత్రాలు

దంతాలపల్లి, ఫిబ్రవరి 26: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నిప్పంటుకొని ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలోని గున్నెపల్లిలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన భాషపాక వెంకటమ్మకు కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేయగా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం రేకుల షెడ్ వేసుకొని నివసిస్తోంది. ఉదయం ఆమె ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. ఇంట్లో నుంచి పెద్ద ఎత్తున పొగలు వస్తుండటంతో స్థానికులు ఆమెకు సమాచారం అందించారు. మంటలు చెలరేగడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైరింజిన్‌తో చేరుకొని వారు మంటలు ఆర్పేశారు. అప్పటికే ఇంటి నిర్మాణం కోసం ఉంచిన రూ.1.5లక్షల నగదు, తులం బంగారం, 30 తులాల వెండి, టీవీ, కూలర్, బియ్యం, బట్టలు, బీరువా, ఇతర సామగ్రి, విలువైన పత్రాలు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.3.5లక్షల విలువైన ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలిపింది. కట్టుబట్టలతో మిగిలానని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి తనను ఆదుకోవాలని ఆమె కోరింది.

దగ్ధమైన ఇల్లులోని సామగ్రి

మంటల్లో కాలిన నగదు, విలువైన పత్రాలు

వంట సామగ్రి, బియ్యం అందజేత

దంతాలపల్లి, ఫిబ్రవరి 26: మండలంలోని గున్నెపల్లిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చేలరేగి వెంకటమ్మ ఇంట్లో నగదు, వస్తువులు, సామగ్రి, బియ్యం బట్టలు కాలిపోగా రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు ఉమేశ్ వంట సామగ్రి, దుప్పట్లు, ఇంటి పైకప్పు కోసం టార్పాలిన్ అందజేశారు. మాజీ ఎంపీటీసీ కడుదుల రాధిక మధుకర్‌రెడ్డి 50 కిలోల బియ్యం అందజేశారు. మాజీ సర్పంచ్ వెంకటనారాయణ, రాంరెడ్డి, అశోక్‌రెడ్డి, ఉమేశ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రమేశ్, సుధాకర్‌రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

వెంకటమ్మకు వంట సామగ్రి, బట్టలు అందిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు

ప్రభుత్వ పాఠశాలల్లోని స్కావెంజర్ల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

నెల్లికుదురు, ఫిబ్రవరి 26: స్కావెంజర్ల పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని తెలంగాణ స్కావెంజర్ల సంఘం జిల్లా కన్వీనర్ ఇస్సంపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, పరిసరాలను శుభ్రం చేయడానికి ఒక్కొక్కరికి నెలకు రూ.3వేల చొప్పున పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా స్కావెంజర్లను తాత్కాలిక పద్ధతిలో నియమించుకున్నారని తెలిపారు. వీరికి ఇప్పటివరకు మూడు నెలల వేతనం మాత్రమే ఇచ్చారని, ఆరు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. దీంతో వారు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని